డంపింగ్ యార్డుతో తిప్పలు

● ప్రధాన రహదారి పక్కనే చెత్తాచెదారం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని రాజుపేట శివారులోని చింతగడ్డతండా సమీపంలోని డంపింగ్ యార్డుతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. సుమారు పదేళ్ల క్రితం రెండెకరాల స్థలాన్ని (బొంద) డంపింగ్ యార్డు కోసం ఎంపిక చేసి పట్టణంలోని 24 వార్డుల నుంచి సేకరించిన చెత్తను పోస్తుండగా అది కాస్తా నిండిపోయింది. డంపింగ్ యార్డ్‌ను వేరొక చోటికి మార్చాలని ప్రజలు పలుమార్లు విన్నవించినా పట్టించుకున్న దాఖలాల్లేవన్న విమర్శలున్నాయి.

మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న నర్సంపేట 2012–13 ఆర్థిక సంవత్సరంలో సర్వాపురం, ద్వారకపేట గ్రామాలతో కలిసి నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ అయ్యింది. అలాగే 2018లో కమలాపురం గ్రామాన్ని కలుపుతూ మున్సిపాలిటీగా ఉన్నతీకరించి పట్టణ పరిధి మొత్తాన్ని 24 వార్డులు విభజించారు. ప్రస్తుతం నర్సంపేట మండలంలోని నాగుర్లపల్లి, మాధన్నపేట, పర్శనాయక్‌తండా, ముత్తోజీపేట, ముగ్దుంపురం, రాజపల్లి, రాములునాయక్ తండా, మహేశ్వరం గ్రామాలను కలుపుతూ గ్రేడ్–2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయి 30 వార్డులతో కొనసాగుతోంది. కాగా పాత గ్రామపంచాయతీల పరిధిలో నాటి ప్రభుత్వాలు ప్రత్యేకంగా స్థలాలను కేటాయించి డంపింగ్ యార్డుల నిర్మాణాలను


నర్సంపేట-పాకాల ప్రధాన రహదారిపై పోసిన చెత్తాచెదారం

సైతం చేపట్టాయి. ఈ క్రమంలో పట్టణ పరిధిలో స్థలం లేకపోవడంతో రాజుపేట పంచాయతీ పరిధిలోని నర్సంపేట–పాకాల ప్రధాన రహదారిపై అక్రమ మట్టి దందాతో ఏర్పడిన పెద్ద బొందను మున్సిపల్ అధికారులు డంపింగ్ యార్డుకు నిర్ణయించారు. వర్షాకాలం కావడం, చెత్త నిండిపోవడంతో వారం రోజులుగా చెత్తను రోడ్డుపైనే పోస్తుండడంతో కంపుకొడుతోంది. గాలికి సమీపంలోని ప్రధాన రహదారిపై ప్రయాణిస్తున్న వాహనాలపై చెత్తాచెదారం పడుతుండడంతో జనం ఇబ్బంది పడుతున్నారు. చెత్తకు నిప్పంటించినప్పుడు పొగతో రోడ్డు కమ్ముకుపోతుండడంతో ప్రమాదాలూ చోటు చేసుకుంటున్నాయి. డంపింగ్ యార్డును వేరే చోటికి మార్చుతామంటూ అధికారులు స్థల సేకరణకు యత్నించినా మార్చలేదు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి డంపింగ్ యార్డును మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

పాకాలకు వెళ్లాలంటే ముక్కు మూసుకోవాలి

నర్సంపేట డివిజన్ పరిధిలోని అతిపెద్ద సరస్సుగా గుర్తింపు పొందిన పాకాలను పర్యాటక కేంద్రంగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. పాకాల అందాలను వీక్షించేందుకు సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న పర్యాటకులు నర్సంపేట–పాకాల రహదారిపై చెత్తతో ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోంది.

యూరియా కోసం రైతుల పాట్లు


నర్సంపేట : బారులు దీరిన రైతులు


ఖానాపురం : మాట్లాడుతున్న ఎస్సై రఘుపతి


దుగ్గొండి : గిర్నిబావిలో..

సాక్షి నెట్‌వర్క్ : నర్సంపేట, ఖానాపురం, చెన్నారావుపేట, దుగ్గొండి మండలాల్లో యూరియా కోసం సోమవారం రైతులకు పాట్లు తప్పలేదు. ఆ మండలాల్లో సొసైటీల వద్ద రైతులు యూరియా కోసం ఆదివారం రాత్రి నుంచే బారులు దీరారు. ఖానాపురంలో టోకెన్లు ఇవ్వడం లేదంటూ రైతులు రోడ్డుపై రాస్తారోకో చేశారు. రైతులు రమేశ్, నర్సింహులు స్పృహ తప్పి పడిపోయారు. మహబూబాబాద్ వైపు లారీలో యూరియా వెళ్తుండగా యూరియా బస్తాలను రైతులు యత్నించారు. ఎస్సై రఘుపతి రైతులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. పలు చోట్ల తోపులాట చోటు చేసుకుంది.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

రాయపర్తి : ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తెలిపారు. మండలంలోని సూర్యతండాలో వరంగల్ టూ అన్నారం బస్సును టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి, అధికారులతో కలిసి ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించి మాట్లాడారు. దశాబ్దాలుగా రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డారని, ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదన్నారు. తండాలు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 72 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అలాగే 34 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. తదనంతరం స్థానిక స్వర్ణభారతి సమాఖ్య ఆధ్వర్యంలో పథకాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రూ.4.96 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు, మదర్ యూనిట్లు పంపిణీ చేశారు. మహిళలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కిషన్‌నాయక్, ఎంపీఓ కూచన ప్రకాశ్, ఏపీఎం రవీందర్, తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు పోషకాహారం కీలకం

● సీడీపీఓ మధురిమ


నర్సంపేట : మాట్లాడుతున్న సీడీపీఓ మధురిమ

నర్సంపేట : చిన్నారులకు చదువుతోపాటు పోషకాహారం కీలకమని ఐసీడీఎస్ సీడీపీఓ మధురిమ తెలిపారు. పట్టణంలోని ఐఎంఏ హాలులో అంగన్‌వాడీ టీచర్లకు ఏర్పాటు చేసిన మూడ్రోజుల శిక్షణను సీడీపీఓ మధురిమ, బానోజీపేట మెడికల్ ఆఫీసర్ అరుణ్‌కుమార్, పల్లె దవాఖానా మెడికల్ ఆఫీసర్ శ్రావణ్, హెల్త్ సూపర్‌వైజర్ రామలింగయ్య జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం సీడీపీఓ మాట్లాడారు. ఐసీడీఎస్, హెల్త్ డిపార్ట్‌మెంట్ సమిష్టి కృషితో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రమాదేవి, మాధవి, వాసంతి, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ అనిత, డివిజన్ కోఆర్డినేటర్ శ్రీలత, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు భారతి, తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సావేశ మందిరంలో నల్లబెల్లి, దుగ్గొండి మండలాల అంగన్‌వాడీ టీచర్ల ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరాన్ని సీడీపీఓ మధురిమ ప్రారంభించి మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి, తల్లుల ఆరోగ్యానికి అవసరమైన జ్ఞానం గ్రామీణ స్థాయిలో అందించడంలో అంగన్‌వాడీ టీచర్ల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అరుణ, జయరాణి, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

● వరుస దొంగతనాలతో జనం బెంబేలు


పగిలిపోయిన బీరువా

నల్లబెల్లి : దొంగలు తాళం వేసిన ఇంట్లో చోరీ చేసిన ఘటన లో మండలంలోని రుద్రగూడెంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా.. అడిదెల దేవక్క కుమారులు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో రుద్రగూడెంలో ఒంటరిగా ఉంటున్న దేవమ్మకు ఇటీవల జ్వరం రాగా కుమారులు ఆమెను 15 రోజుల క్రితం హైదరాబాద్ తీసుకెళ్లారు. ఈ క్రమంలో దొంగలు దేవక్క ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.1.80 లక్షల విలువైన 3 తులాల బంగారు హారాన్ని చోరీ చేశారు. బంధువుల ద్వారా సమాచారం అందుకున్న దేవక్క కుమారులు చేరుకుని పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోవర్దన్ తెలిపారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. ఇదిలా గ్రామానికి చెందిన నందికొండ రాములు ఇటీవల మృతి చెందగా ఆయన కుమారుడు మహిపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఇళ్లు వదిలి మరో చోట నివాసం ఉంటున్న విషయాన్ని గమనించి ఇటీవల ఇంటి తాళాలు పగులకొట్టి చోరీకి యత్నించారు. విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలు, నగదు లభించక పోవడంతో వెనుదిరిగారు. అలగే పాండవుల నర్సింగం, భూర మార్కండేయ ఇళ్లలో చొరబడి గ్యాస్ సిలండర్లు ఎత్తుకెళ్లారు.

‘హిందీ’పై పట్టు సాధించండి


నల్లబెల్లి : మాట్లాడుతున్న హెచ్‌ఎం ఫ్రాన్సిస్


ఖానాపురం : బహుమతి అందజేస్తున్న హెచ్‌ఎం

నల్లబెల్లి : హిందీ భాషపై విద్యార్థులు పట్టు సాధించాలని మండలంలోని శనిగరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఫ్రాన్సిస్ జేవియర్ సూచించారు. ఆ స్కూల్‌లో సోమవారం హిందీ దివస్ నిర్వహించారు. అనంతరం హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ అబ్దుల్ రవూఫ్ విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విజేతలకు హెచ్‌ఎం ఫ్రాన్సిస్ జేవియర్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నటరాజ్, శ్రీనివాస్, మంజుల, వెంకట్రాం నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

దబ్బీర్‌పేట హైస్కూల్‌లో..

ఖానాపురం: మండలంలోని దబ్బీర్‌పేట హైస్కూల్‌లో విద్యార్థులు నిర్వహించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు బహుమతిగా అందజేశారు. హెచ్‌ఎం వెంకట్రామ్ మాట్లాడారు. హిందీ బాషను ప్రతిఒక్కరూ నేర్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్, కిష్టయ్య, మదన్, లింగారెడ్డి, లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి



వరంగల్ అర్బన్ : జర్నలిస్టులపై అక్రమ కేసులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని టీయూడబ్ల్యూజే (143) జిల్లా అధ్యక్షుడు కోరుకొప్పుల నరేందర్ డిమాండ్ చేశారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు మిట్ట నవనీత్, జిల్లా ప్రధాన కార్యదర్శి వాంకే శ్రీనివాస్, కోశాధికారి రాపల్లి ఉపేందర్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి నీలం శివ, కమటం వేణుగోపాల్, ప్రతినిధులు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి చెప్పాలి


సమావేశంలో మాట్లాడుతున్న సత్యం

వర్ధన్నపేట : బీఆర్‌ఎస్ హయాంలో జిల్లాకు, నియోజకవర్గానికి చేసిన అభివృద్ధితోపాటు సర్పంచులకు ఇచ్చిన నిధులను చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యం అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎస్సీ విభాగం రాష్ట్ర నాయకుడు నరుకుడు వెంకటయ్య, జిల్లా సీనియర్ నాయకులు పోశాల వెంకన్నతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సత్యం మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్ మతిస్థిమితం కోల్పోయి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. మంత్రిగా ఎర్రబెల్లి దయాకర్‌రావు బీఆర్‌ఎస్ హయాంలో ఎన్ని నిధులు జిల్లాకు తెచ్చారో ప్రజల ముందు ఉంచాలన్నారు. హామీ మేరకు ఏకగ్రీవమైన గ్రామ పంచాయతీలకైనా రూ.20 లక్షల నిధులు ఇచ్చారా అని ప్రశ్నించారు. బీజేపీకి రాష్ట్రంలో 8 మంది ఎంపీలున్నా యూరియాపై ఎందుకు నిలదీయడం లేదన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు గంటి కుమారస్వామి, గద్దం సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పెంచాలి



సాక్షి నెట్‌వర్క్ : పింఛన్ పెంచాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్‌పీఎస్, ఎమ్మెస్పీ, వీహెచ్‌పీఎస్, ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో జిల్లాలోని నర్సంపేట, చెన్నారావుపేట, నల్లబెల్లి, దుగ్గొండి, ఖానాపూర్, వర్ధన్నపేట, సంగెం, గీసుకొండ, పర్వతగిరి, రాయపర్తి, తదితర మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సోమవారం ధర్నా చేసి నిరసన తెలిపారు. ర్యాలీలు నిర్వహించారు. తహసీల్దార్లకు, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీల నాయకులు మాట్లాడారు. వికలాంగుల, వృద్ధుల, వితంతువుల, ఒంటరి మహిళల పింఛన్లు పెంచాలని డిమాండ్ చేశారు.

క్రీడా దుస్తుల బహూకరణ

నర్సంపేట : చెన్నారావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అమెరికాలో నివాసం ఉంటున్న పోతిరెడ్డి అవినాశ్‌రెడ్డి, కేటి దంపతులు వారి కుమారుడు నియమ్ మొదటి పుట్టిన రోజు సందర్భంగా సోమవారం క్రీడా దుస్తులు బహూకరించారు. ఈ సందర్భంగా దాతలను హెచ్‌ఎం ఈదునూరి రవీందర్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూరయ్య, పూదోట అనిల్‌కుమార్, మర్రి రాజు, కన్నెదార అనిల్‌కుమార్, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా విక్రేతల బైండోవర్

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండ, అన్నారం, పర్వతగిరి గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి నలుగురిని అరెస్టు చేసి 15 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు వర్ధన్నపేట ఎక్సైజ్ ఎస్సై సరిత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మీడియాకు వివరాలు వెల్లడించారు. దాడుల సందర్భంగా అన్నారంలో మార్యహనుమంతు, పిట్టల రామక్క, చింతనెక్కొండలో బొచ్చు లచ్చమ్మ, పర్వతగిరిలో పుల్లూరి కుమారస్వామి నుంచి గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సదరు నలుగురిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు వివరించారు. గుడుంబా రవాణా చేసినా, విక్రయించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సీసీ కెమెరాలతో నేరాలకు అడ్డుకట్ట


కెమెరాలకు మరమ్మతు చేయిస్తున్న ఎస్సై

ఖానాపురం : సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలకు అడ్డుకట్ట వేయొచ్చని ఎస్సై రఘుపతి తెలిపారు. మండలంలోని బుధరావుపేటలో చెడిపోయిన పలు సీసీ కెమెరాలకు సోమవారం ఆయన మరమ్మతు చేయించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఎస్సై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ సీసీ కెమెరాల ఏర్పాటు అవసరమన్నారు. అవకాశం ఉన్న ప్రతిఒక్కరూ ఇళ్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్య చేపట్టండి

గీసుకొండ : అధిక వర్షాలకు వరి, పత్తి, కంది, మొక్కజొన్న తదితర పంటలు దెబ్బతినకుండా రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఎస్ఎస్ఎఫ్ఎం జిల్లా కన్సల్టెంట్ సారంగం, స్థానిక ఏఈఓ హరిప్రసాద్‌బాబు సూచించారు. మండలంలోని గొర్రెకుంటలో సోమవారం నిర్వహించిన ఏరువాక సాగుబడి కార్యక్రమంలో వారు మాట్లాడారు. అనంతరం వంచనగిరిలో కంది, ఊకల్‌లో వరి చేలను పరిశీలించారు. గుళికల రూపంలో ఉన్న యూరియా కాకుండా నానో యూరియా, డీఏపీలను పంట చేలపై వేస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ దొంగల రమేశ్, మొగిలిచర్ల పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈఓలు సంపత్, రజని, కావ్య, తదితరులు పాల్గొన్నారు.

‘ఏఈఓపై చర్యలు తీసుకోవాలి’

నర్సంపేట: చెన్నారావుపేట మండలంలోని కోనాపురం రైతులకు యూరియా ఇవ్వకుండా పోలీసుల సాయంతో గెంటి వేయించిన ఉప్పరపల్లి ఏఈఓ శశికుమార్‌పై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ మాజీ వార్డు సభ్యుడు దొంగల రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. ఉప్పరపల్లిలో యూరియా ఇస్తున్నట్టు తెలిసి కోనాపురం రైతులు వెళ్లగా క్యూలైన్ నుంచి గెంటి వేయించారని చెప్పారు.

‘చరిత్ర వక్రీకరణకు కుట్ర’

నర్సంపేట రూరల్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్ర వక్రీకరణకు బీజేపీ కుట్ర చేస్తోందని సీపీఎం మండల కార్యదర్శి కోరబోయిన కుమారస్వామి అన్నారు. నర్సంపేట మండలం ఇటికాలపల్లిలో ఆ పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి అన్వర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశానికి కుమారస్వామి హాజరై మాట్లాడారు. తెలంగాణను ముస్లిమ్ రాజు పాలించినప్పటికీ హిందువులైన దొరలు, భూస్వాములు, దేశ్‌ముఖులు ప్రజలపై దాడులు, దౌర్జన్యాలు చేశారని తెలిపారు. ఎర్రజెండా నాయకత్వంలో పేదలు పోరాడారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పెండ్యాల సారయ్య, మొగిలి, వనాచారి, గోనె మల్లారెడ్డి, బాల కొమురు, దేశిని నగేశ్, చేరాలు, కత్తి స్వామి, విజయ్‌బాబు, బాబు, తదితరులు పాల్గొన్నారు.

సేవా పక్షం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

నల్లబెల్లి : ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్న సేవా పక్షం కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు తడుక వినయ్ కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి మోదీ 75వ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరాలు, హరితహారం, స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. అలాగే తెలంగాణ విమోజన దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగరేయాలని కోరారు. సమావేశంలో సేవా పక్షం అభియాన్ కన్వీనర్ నాగరాజు, నాయకులు పెరుమాండ్ల కోటి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రాయపర్తి : మండలంలోని గణేశ్‌కుంటతండాకు చెందిన మూనావత్ దల్సానాయక్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహనాయక్ సోమవారం పరామర్శించారు. అనంతరం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.3 వేల సాయం అందించారు. అనంతరం సోషల్ మీడియా నాయకుడు జక్కుల రాజుకు యాక్సిడెంట్ కాగా వైద్యం కోసం రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు గజవెల్లి ప్రసాద్, మూనావత్ సుజాత నర్సింహనాయక్, మూనావత్ రవి తదితరులు పాల్గొన్నారు.

నివాళి

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని లింగగిరికి చెందిన అనుముల సరోజన సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందగా ఆమె మృతదేహానికి బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డ్యాగల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు యాకయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుమారుడైన బీసీ సంక్షేమ సంఘం నాయకుడు అనుముల సుధాకర్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి సంగెం రమేశ్, మండల ఉపాధ్యక్షుడు పులి రమేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

వర్ధన్నపేట : విద్యార్థులకు బకాయి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ డబ్బులు వెంటనే చెల్లించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోళ్ల అజయ్ డిమాండ్ చేశారు. ఆ సంఘం పట్టణ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రహదారిపై సోమవారం బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడారు. నాలుగేళ్లుగా ప్రభుత్వం రూ.8600 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలల్లో చదివే పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారన్నారు. నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి వదిలేశారు. కార్యక్రమంలో సంఘం నగర కార్యదర్శి చిక్కొండ వినయ్, మనోజ్, ప్రశాంత్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

విమర్శలు సరికాదు



రాయపర్తి : కాంగ్రెస్ నాయకులపై విమర్శలు సరికాదని ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చిర్ర మల్లయ్య, బద్దం రంగారెడ్డి, గారె భిక్షపతి అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రైతు సంక్షేమంపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో నాయకులు కిషన్, దేదావత్ రామానాయక్, గుగులోతు యాకూబ్, భూక్య వెంకన్న నాయక్, వీరునాయక్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆవిర్భావ వేడుక



నర్సంపేట : ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకను పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ అధ్యక్షతన కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు ధోని కీర్తన, తదితరులు పాల్గొన్నారు.

చౌటపల్లి సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా శ్రీకాంత్‌రెడ్డి


శ్రీకాంత్‌రెడ్డి

పర్వతగిరి : మండలం చౌటపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ)కి పర్సన్ ఇన్‌చార్జ్‌గా జిల్లా సహకార కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీకాంత్‌రెడ్డి నియమితులయ్యారు. పాలకవర్గాన్ని ప్రభుత్వం ఇటీవల రద్దు చేసిన క్రమంలో శ్రీకాంత్‌రెడ్డిని పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమించినట్లు డీసీఓ నీరజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీలో అవినీతి జరిగిందని గతంలో ఆడిటర్లు నివేదికలు ఇవ్వడంతో పాలకవర్గాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

పదోన్నతి


ధనలక్ష్మి

వర్ధన్నపేట : ఎంపీఓగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్న అంకం ధనలక్ష్మికి డివిజనల్ పంచాయతీ అధికారిగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆమెను జగిత్యాల జిల్లా కోరుట్ల డివిజన్‌లో బాధ్యతలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ధనలక్ష్మిని అధికారులు, సిబ్బంది అభినందించారు.

జీపీఓలకు క్లస్టర్ల కేటాయింపు

వర్ధన్నపేట : జీపీఓలకు మండలంలోని గ్రామాల వారీగా క్లస్టర్లు కేటాయించినట్లు ఎంపీడీఓ జి.వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్ధన్నపేట–1కు ఎం.రమేశ్, వర్ధన్నపేట–2కు గోపీ, ల్యాబర్తికి రవికిరణ్, నల్లబెల్లికి యాకయ్య, కట్ర్యాలకు హారిక, కొత్తపల్లికి కరుణాకర్, ఇల్లంద–1కు లావణ్య, ఇల్లంద–2కు నాగదీప్తి, దివిటిపల్లి రామవరం క్లస్టర్‌కు ఎల్లయ్య, దమ్మన్నపేటకు రామ్మూర్తి, ఉప్పరపల్లికి ఈ.రమేశ్, బండౌతాపురం క్లస్టర్‌కు దుర్గయ్యను కేటాయించినట్లు వివరించారు.

పొదుపు సంఘం ఏర్పాటు

గీసుకొండ : మండలంలోని ధర్మారంలో శ్రీ లక్ష్మీ గణపతి పొదుపు (పరపతి) సంఘాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. సుమారు 30 ఏళ్లుగా గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న స్నేహాంజలి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానికులు సంఘంలో సభ్యులుగా చేరారు. సంఘం ద్వారా పొదుపు పెంచుకోవడంతోపాటు ఏటా గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తీర్మానించారు. కోశాధికారిగా గురిజాల లక్ష్మణ్ బాధ్యతలు చేపట్టారు.

సన్మానం



నర్సంపేట : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి జెడ్పీ హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు వర్దెల్లి సతీశ్‌కుమార్‌ను తెలంగాణ మ్యాథమెటిక్స్ ఫోరం (టీఎంఎఫ్) ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నందికొండ శ్రీనివాస సతీశ్, దేవునూరి ఆనంద్, జిల్లా అధ్యక్షుడు మిత్తింటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కావటి కనకయ్య, ఉపాధ్యాయులు సన్మానించారు.

సైన్స్ ఉపాధ్యాయుడికి..



ఉప్పరపల్లి జెడ్పీ హైస్కూల్ బయాలజీ సైన్స్ ఉపాధ్యాయుడు రాగి శశిధర్‌ను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం తేజావత్ జయ మాట్లాడారు. శశిధర్ గతంలో పని చేసిన మల్లంపల్లి జెడ్పీ స్కూల్ రాష్ట్రస్థాయిలో ఉత్తమ హరిత పాఠశాలగా ఎంపికవడంలో పాత్ర పోషించారని చెప్పారు.

స్తంభాలను తొలగించాలి

గీసుకొండ : గొర్రెకుంటలో ప్రమాదాలకు కారణమవుతున్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని కోరుతూ మాదిగ జాగృతి సంఘం (ఎంజేఎస్) జిల్లా అధ్యక్షుడు సిలువేరు రవి ఆధ్వర్యంలోని బృందం మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగ రవి మాట్లాడారు. రెండేళ్ల క్రితం సీసీ రోడ్డును నిర్మించిన క్రమంలో విద్యుత్ స్తంభాలన